నమస్తే తెలంగాణ

ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, సోమవారం 21 అక్టోబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




వరంగల్ కోటలోని అమర వీరుల స్తూపం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ శ్రేణులు



వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న రైతు

# కాంగ్రెస్ సర్కారు తీరుపై బీఆర్ఎస్ రణం

రైతుభరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసనలతో హోరెత్తించింది. అన్ని మండల కేంద్రాల్లో అన్నదాతలతోపాటు గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నాలు, రాస్తారోకోలతో పాటు రాష్ట్ర సర్కారు, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. యాసంగిలో పెట్టుబడి పైసలు ఇవ్వకపోగా, కనీసం వానకాలమైనా ఇస్తారనుకున్న రైతన్నల ఆశలపై నీళ్లు చల్లుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతు భరోసా ఇవ్వలేమంటూ చేతులెత్తేయడంపై అన్నదాతలు, బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ప్రభుత్వ తీరును ఎండగడుతూ నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు.

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 20**





ములుగులోని గాంధీచౌక్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి రైతులకు మద్దతుగా నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పరకాలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఖానాపురంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



భూపాలపల్లిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు



## రైతు భరోసా ఎగ్గొట్టడంపై నిరసనలు

- **ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు**
- **ధర్నాలు, రాస్తారోకోలతో పాటు సర్కారు, సీఎం దిష్టిబొమ్మల దహనం**
- **ప్రభుత్వ తీరును ఎండగట్టిన అన్నదాతలు, గులాబీ నేతలు**
- **ఆందోళనల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు**

గత ప్రభుత్వం రెండు పంటలకు ఎకరాకు రూ.10వేలు పెట్టుబడి సాయం అందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15వేలు ఇస్తామని చెప్పి మోసం చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హామీలిచ్చి ఇప్పుడు చేతులెత్తేయడంపై ఆరు జిల్లాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో గులాబీ పార్టీ నాయకులు రాస్తారోకో చేశారు. కాజీపేట చౌరస్తాలో రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. ప్లకార్డులు చేతబూని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హుస్నాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన వెలిబుచ్చారు. జనగామ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలకు నిప్పుపెట్టారు. మహబూబాబాద్‌లోని ఎమ్మార్వో సెంటర్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించాయి. నెల్లికుదురులో రాస్తారోకో నిర్వహించగా శంకర్‌నాయక్ పాల్గొన్నారు. డోర్నకల్ ముత్యాలమ్మ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ములుగులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశాయి. ఖిలా వరంగల్‌లోని పడమర కోటలోని అమరవీరుల స్తూపం, అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు.



డోర్నకల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు










కాజీపేటలో ధర్నాలో పాల్గొన్న కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మహబూబాబాద్‌లో రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, హుస్నాబాద్‌లో నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

## టాటా ఏస్‌ను ఢీకొట్టిన బైక్

### అక్కడికక్కడే ఇద్దరు యువకుల మృతి



దేవరుప్పుల, అక్టోబర్ 20: జనగామ–సూర్యాపేట హైవేపై గొల్లపల్లి వద్ద టాటా ఏస్‌ను బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలుకు చెందిన బోయ నర్సింహ(20), వనపర్తి జిల్లా మదనపురానికి చెందిన చీరోలు భరత్(22) కొంతకాలంగా కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ఉంటున్నారు. ప్లంబింగ్ పనులు చేస్తున్న వీరు ఆదివారం దేవరుప్పులకు బైక్‌పై వస్తున్నారు. ఈక్రమంలో దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి చెందిన రాపాక ఉప్పలయ్య, రేణుక మొండ్రాయిలోని ఓ వడ్రంగి వద్ద తలుపులు, దర్వాజలు చేయించగా వాటిని తీసుకొచ్చేందుకు కొంగర భాస్కర్‌కు చెందిన టాటా ఏస్ వాహనంలో బయలుదేరారు. వీరి వాహనం గొల్లపల్లి స్టేజీ దాటుతుండగా బైక్ ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న టాటాఏస్‌ను ఢీకొట్టారు. దీంతో నర్సింహ, భరత్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. టాటా ఏస్‌లోని కొంగర భాస్కర్, రాపాక ఉప్పలయ్య, రేణుక గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై సృజన్‌కుమార్ బాధితులను జనగామలోని ఏరియా దవాఖానకు, మృతదేహాలను మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పాండువులగుట్టలో అధికారులు, వలంటీర్లు

## కోటగుళ్లలో వలంటీర్లు

### శిక్షణలో భాగంగా సందర్శన

వెంకటాపూర్, అక్టోబర్ 20: మండలంలోని పాలంపేట గ్రామం రామప్పలో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం పాండవుల గుట్ట, కోటగుళ్లను సందర్శించారు. వలంటీర్స్, యువ టూరిజం క్లబ్ సభ్యులకు ఉదయం రామప్పలో యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగా క్లాసులు నిర్వహించారు. అనంతరం శిక్షణలో భాగంగా కాకతీయుల కళాక్షేత్రమైన గణపురంలోని కోటగుళ్లు, పాండవుల గుట్టలను సందర్శించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగా రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్, బాబు, టూరిజం గైడ్స్, టూరిజం, పురావస్తు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు అమరుడా.. వందనం..!

- **నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం**
- **31 వరకు పోలీసు ఫ్లాగ్‌డే కార్యక్రమాలు**
- **ఉమ్మడి వరంగల్ జిల్లాలో నక్సల్స్ చేతిలో హతమైన 61 మంది పోలీసులు**



సుబేదారి, అక్టోబర్ 20 : శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ఎంతో మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారు. వారి త్యాగాలను స్మరిస్తూ పోలీసు శాఖ సోమవారం నుంచి 31వరకు పోలీసు ఫ్లాగ్‌డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సోమవారం పోలీసు అమరవీరుల స్తూపం వద్ద వివిధ సంఘటనల్లో నక్సల్స్ చేతుల్లో అమరులైన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించి, శోక్ శస్త్ర పరేడ్ నిర్వహిస్తారు. తర్వాత కమిషనరేట్ నుంచి అశోకా జంక్షన్ వరకు కవాతు చేస్తారు. భారత్–చైనా సరిహద్దుల్లోని అక్సాయ్ చిన్ వద్ద జరిగిన ఘటనలో అసువులు బాసిన భారత అమర జవానుల త్యాగాలకు ప్రతీకగా దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన పోలీసులను స్మరిస్తూ తొలిసారి అక్టోబర్ 21, 1959లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా జరుపుకున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు డివిజన్లవారీగా రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు పోలీసు విధులపై ప్రతిభా పోటీలు, పోలీసులు వినియోగించే ఆయుధాలపై ఆన్‌లైన్ పద్ధతిలో ఓపెన్ హౌస్, నగరంలోని ప్రధాన జంక్షన్ల వద్ద పోలీసు అమరవీరులను స్మరిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తారు. ప్రజలు, విద్యార్థులు పాల్గొని పోలీసు అమరవీరుల కుటుంబాలకు బాసటగా నిలువాలని సీపీ అంబర్ కిశోర్ ఝా పిలునిచ్చారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు మూడు దశాబ్దాల పాటు నక్సల్స్‌కు, పోలీసులకు మధ్య భీకర పోరు జరిగింది. 1985లో కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఎస్సై యాదగిరిరెడ్డిని నక్సల్స్ కాల్చిచంపారు.


ఆ తర్వాత కరుణాపూరం, స్టేషన్‌ఘన్‌పూర్, ఊరుగొండ, జాకారం, పస్రా తదితర ప్రాంతాల్లో నక్సల్స్ జరిపిన బాంబు పేలుళ్లలో 61మంది పోలీసులు అమరులయ్యారు. వీరిలో డీఎస్పీ నుంచి సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డు వరకు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, స్వరాష్ట్రంలో వరంగల్ పోలీసులకు నక్సల్స్ అణిచివేత, శాంతి భద్రతల పరిరక్షణలో దేశంలోనే ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.

## ముగిసిన అంతర్ కళాశాలల పోటీలు

### విజేతలకు ట్రోఫీలు అందజేసిన ఎమ్మెల్యే నాయిని



బాస్కెట్‌బాల్ జట్టుతో ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు



ఆర్ట్స్ కాలేజీలో ఖోఖో ఆడుతున్న కేడీసీ విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 20: కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ లో నిర్వహిస్తున్న 2024–25 విద్యా సంవత్సరం అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. బాల్‌బ్యాడ్మింటన్‌లో మొదటి బహుమతి వాగ్దేవి కాలేజీ, రెండవ బహుమతి సీకేఎం, ఖోఖోలో మొదటి బహుమతిని కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ, రన్నర్స్‌గా కేడీసీ, సాఫ్ట్‌బాల్‌లో మొదటి బహుమతిని ఆర్ట్స్ కాలేజీ, రన్నర్స్‌గా వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ట్రోఫీలను అందజేసి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో మంచి క్రీడాకారులను తయారు చేసేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అందుకు కావాల్సిన ప్రణాళికలు తయారుచేసి తమకు పంపిస్తే కేయూ చాన్స్‌లర్‌తో మాట్లాడి క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ కాలేజీలో విద్యతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించేందుకు అంతర్ కళాశాలల క్రీడలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సంచాలకులు ప్రొఫెసర్ వెంకయ్య, వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్, గిరిప్రసాద్, హెల్త్ సెంటర్ నిర్వాహకులు సలీం, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.


## అతిథి అధ్యాపకుల ఆకలి కేకలు

- **ఐదు నెలలుగా అందని వేతనాలు**
- **ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లెక్చరర్లు**

గిర్మాజీపేట, అక్టోబర్ 20: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు ఆకలి కేకలు పెడుతున్నారు. అకాడమిక్ ఇయర్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు వీరి చేతికి నయాపైసా అందలేదంటే అతిశయోక్తి కాదు. ఇటు పర్మినెంట్ కాక.. అటు నెలలు తరబడి వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నామని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 25 మంది గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. తెలంగాణ ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ, దసరా పండుగ వేళ కూడా వారిని పస్తులు ఉంచడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని విమర్శిస్తున్నారు. ఒకవైపు వేతనాలు రాక మరోవైపు విధులకు హాజరయ్యేందుకు బస్ చార్జీలు, బైక్‌లో పెట్రోల్ పోసుకునేందుకు జేబులో చిల్లిగవ్వ లేదని అధ్యాపకులు వాపోతున్నారు. కనీసం దీపావళి పండుగకైనా వేతనాలు అందించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## ఏరికోరి.. మళ్లీ జనగామకే..

- **సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చిన అమ్జద్ అలీ**
- **కాంగ్రెస్ పెద్దల అండతో పోస్టింగ్ ఆర్డర్?**
- **వివాదాస్పద ఫైళ్లను కదిలిస్తున్న మధ్యవర్తులు, రియల్టర్లు**



జనగామ, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : రాబడి అధికంగా ఉన్న శాఖల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారులు ఏరి.. కోరి.. మళ్లీ జనగామకే వస్తున్నారు. ఇక్కడ ఎక్కువ కాలం విధులు నిర్వర్తించి వెళ్లినా ఇదే స్థానాన్ని కోరుకోవడంలో మతలబేమిటోననే గుసగుసలు వినిపిస్తున్నాయి. జనగామ సబ్ రిజిస్ట్రార్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన అమ్జద్ అలీ లాంగ్ స్టాండింగ్ నెపంతో మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లి అక్కడ 10 నెలలు పనిచేశారు. తర్వాత వరంగల్‌కు వచ్చి.. పలు కారణాలతో స్టేషన్‌ఘన్‌పూర్‌కు పోస్టింగ్ వేయించుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తిరిగి జనగామ రిజిస్ట్రార్‌గా ఆయన రావడం చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి వివాదాస్పదమైన అమ్మకాలు, కొనుగోళ్ల డాక్యుమెంట్లు అయినా 'మాట్లాడుకొని' ఫైల్ ముందుపెడితే క్లియర్ చేయడంలో అమ్జద్ అలీ తర్వాతనే ఇంకెవరైనా అనే స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. జనగామలో అంతగా పాతుకుపోయిన ఆయనే మళ్లీ రావడంతో రియల్టర్లు, అమ్మకం, కొనుగోలుదారులు, మధ్యవర్తులు పండుగ చేసుకుంటున్నారు. అమ్జద్ అలీ ఇక్కడి నుంచి వెళ్లిన తర్వాత పనిచేసిన ఇద్దరు, ముగ్గురు సబ్ రిజిస్ట్రార్లు 'వామ్మో ఇవి మావల్ల కావు.. ఉద్యోగాలు పోతాయ్' అంటూ భయపడి పక్కకు పడేసిన ఫైళ్లను దుమ్ముదులిపి సార్‌తో మాట్లాడి ముందు పెట్టేందుకు డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తులు, రియల్టర్లు సిద్ధపడుతున్నారు. అటు, ఇటు తిరిగిన అమ్జద్ అలీ జనగామలో పోస్టింగ్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధితో పైరవీ చేయించుకొని కోరి మరీ బదిలీ ఆర్డర్ తెచ్చుకున్నారనే చర్చ జరుగుతున్నది.